23 రోజులు 3,900 కిలోమీటర్లు

కశ్మీర్ టు కన్యాకుమారి సైక్లింగ్ రైడ్‌లో 13 మంది నగర సైక్లిస్టులు

హెచ్‌సీజీ ఆధ్వర్యంలో హ్యాట్రిక్ ఫీట్

సిటీబ్యూరో, డిసెంబర్ 13: హైదరాబాద్ సైక్లిస్ట్స్ గ్రూప్(హెచ్‌సీజీ) అరుదైన ఘనత సొంతం చేసుకుంది. దేశంలోనే మొదటి సారిగా 'కశ్మీర్ టు కన్యాకుమారి' సైక్లింగ్ యాత్రను ముచ్చటగా మూడోసారి పూర్తి చేసింది. ఈ క్రమంలో సరిహద్దుల్లో ఆర్మీ అధికారుల ప్రశంసలు పొందారు. సైక్లింగ్ వినియోగం ప్రోత్సహించాలనే లక్ష్యంతో నగరానికి చెందిన 13 మంది హెచ్‌సీజీ సైక్లిస్టులు 23 రోజుల్లో లడఖ్ నుంచి 13 రాష్ట్రాల మీదుగా వయా హైదరాబాద్ గుండా కన్యాకుమారి చేరుకుని యాత్రను ముగించారు. వీరంతా బుధవారం నగరానికి చేరుకున్నారు. మొత్తం 3,900 కిలోమీటర్ల మేర సైక్లింగ్ రైడ్ చేసి ఔరా అనిపించారు. హెచ్‌సీజీ ఫౌండర్ రవీందర్ నందనూరి ఆధ్వర్యంలో రేఖ సోలంకి, రవీందర్ రెడ్డి, ప్రదీప్ కుమార్, సురేశ్‌బాబు, ప్రవీణ్ కుమార్, భవేష్ కుమార్, మోహిత్ కుమార్, నాగరాజు, సంతోష్, కవిష్, వెన్నెల, రాహుల్, సోమశేఖర్ ఈ సాహస సైక్లింగ్ యాత్రలో పాల్గొని విజయవంతం చేశారు. నవంబర్ 21న వీరి యాత్ర లడఖ్ నుంచి ప్రారంభమైంది. అక్కడి నుంచి 2500 కిలోమీటర్లు రైడ్ చేసి డిసెంబర్ 7న హైదరాబాద్‌కు చేరుకున్నారు. వీరికి నగరంలో అపూర్వ స్వాగతం లభించింది. తిరిగి నగరం నుంచి కన్యాకుమారి వైపుగా సైక్లింగ్ యాత్ర సాగింది. సైక్లింగ్ ప్రారంభం నుంచి ఆఖరి వరకు రోడ్డు మార్గాల గుండా ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందని సైక్లిస్టులు తెలిపారు.

మెరిసిన త్రిష

జాతీయ అండర్-23 టీ20 టోర్నీ

కోల్‌కతా: మహిళల అండర్-23 టీ20 టోర్నీలో హైదరాబాద్ కెప్టెన్ గొంగడి త్రిష సూపర్ ఫామ్ కొనసాగుతున్నది. బుధవారం జమ్ముకశ్మీర్‌తో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 22 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 125 పరుగులు చేసింది. కెప్టెన్ త్రిష(63) అర్ధసెంచరీతో అదరగొట్టింది. మరో హైదరాబాదీ ప్రణవి చంద్ర(31)తో కలిసి త్రిష జట్టుకు మెరుగైన శుభారంభాన్ని అందించింది. వీరిద్దరు జమ్ము బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ తొలి వికెట్‌కు 84 పరుగులు జోడించారు. ముఖ్యంగా త్రిష తన ఇన్నింగ్స్‌లో ఐదు ఫోర్లు, మూడు భారీ సిక్స్‌లతో వరుసగా రెండో అర్ధసెంచరీని ఖాతాలో వేసుకుంది. వీరిద్దరు మినహా హైదరాబాద్ టీమ్‌లో ఎవరూ డబుల్ డిజిట్ స్కోరు అందుకోలేకపోయారు. జమ్ము బౌలర్ నూరిన్‌కు నాలుగు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన జమ్ము కశ్మీర్ 103/6 స్కోరుకు పరిమితమైంది. బౌలింగ్‌లోనూ ఇరుగదీస్తూ త్రిష తొలి బంతికే వికెట్ దక్కించుకోగా, ఇషిత కోడూరి(2/21) రెండు వికెట్లు తీసి ప్రత్యర్థి పతనాన్ని శాసించింది.

ఖేల్‌రత్నకు సాత్విక్, చిరాగ్ జోడీ

- ప్రతిష్ఠాత్మక అవార్డుకు సిఫారసు
- అర్జున అవార్డుకు హుసాముద్దీన్

న్యూఢిల్లీ: దేశంలో అత్యున్నత క్రీడా పురస్కారం మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డుకు భారత స్టార్ బ్యాడ్మింటన్ జోడీ సాత్విక్ సాయిరాజ్, చిరాగ్‌శెట్టిని కేంద్ర క్రీడాశాఖ సిఫారసు చేసింది. అంతర్జాతీయ టోర్నీల్లో సాత్విక్, చిరాగ్ జంట అద్భుత ప్రదర్శన కనబరుస్తున్నది. ప్రతిష్ఠాత్మక టోర్నీలైన ఆసియాగేమ్స్, కామన్వెల్త్, ప్రపంచ చాంపియన్‌షిప్, థామస్ కప్, ఏషియన్ చాంపియన్‌షిప్‌లో చిరాగ్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాత్విక్ సాయిరాజ్ టైటిళ్లు కొల్లగొట్టాడు. ఈ క్రమంలో బీడబ్ల్యూఎఫ్ ర్యాంకింగ్స్‌లోనూ నంబర్‌వన్ ర్యాంక్ దక్కించుకుని కొత్త చరిత్ర లిఖించారు. మరోవైపు తెలంగాణ యువ బాక్సర్ మహమ్మద్ హుసాముద్దీన్ పేరును అర్జున అవార్డుకు ప్రతిపాదించారు. గతేడాది జరిగిన కామన్వెల్త్ గేమ్స్, ఆసియా చాంపియన్‌షిప్‌లో కాంస్యాలతో పాటు ప్రపంచ చాంపియన్‌షిప్(2023) లోనూ హుసామ్ సత్తాచాటాడు. ఇటీవల స్వదేశం వేదికగా ముగిసిన వన్డే ప్రపంచకప్‌లో 24 వికెట్లతో అదరగొట్టిన టీమ్‌ఇండియా స్పీడ్ స్టార్ మహమ్మద్ షమీని పేరును అర్జున అవార్డు కోసం ప్రతిపాదించారు. మెగాటోర్నీలో భారత్‌ను ఫైనల్ చేర్చడంలో షమీ కీలకంగా వ్యవహరించాడు. వీరికి తోడు మొత్తం 16 మంది అర్జున అవార్డు సిఫారసు జాబితాలో ఉన్నారు. ధ్యాన్‌చంద్ లైఫ్‌టైమ్ అవార్డు కోసం కవిత, మంజుషా కన్వర్, వినీత్‌కుమార్ పోటీపడుతున్నారు.

రాధేకు రజతం

జాతీయ రోలర్ స్కేటింగ్ టోర్నీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: చండీగఢ్ వేదికగా జరిగిన 61వ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్రానికి చెందిన రాధే లోయ రజత పతకంతో మెరిసింది. బుధవారం జరిగిన బాలికల అండర్-14 రోలర్ ఫ్రీ స్టయిల్ స్కేటింగ్ ఈవెంట్‌లో రాధే రెండో స్థానంలో నిలిచింది. ఇదే విభాగంలో యశస్వి(కర్ణాటక), వైభవి(తమిళనాడు) వరుసగా స్వర్ణ, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. రాధే లోయ ప్రస్తుతం ఎల్బీ స్టేడియంలో జితేంద్ర గుప్తా దగ్గర శిక్షణ తీసుకుంటున్నది.

గెలిస్తేనే..

నేడు భారత్, దక్షిణాఫ్రికా మూడో టీ20

జోరుమీదున్న సఫారీలు

రాత్రి 8.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

భారత్ మరో కీలక పోరుకు సిద్ధమైంది. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తొలి మ్యాచ్ వర్షార్పణం కాగా రెండో పోరును దక్షిణాఫ్రికా ఖాతాలో వేసుకుంది. గురువారం జరిగే మూడో టీ20లో గెలిచి సిరీస్‌ను సమం చేయాలని టీమ్‌ఇండియా చూస్తుంటే.. సఫారీలు సొంతగడ్డపై సిరీస్ దక్కించుకోవాలన్న పట్టుదలతో ఉన్నారు. మెగాటోర్నీకి ముందు మిగిలిన మ్యాచ్‌ల్లో సత్తాచాటడం ద్వారా జట్టులో చోటు నిలుపుకోవాలని ఇరు జట్ల ప్లేయర్లు కసితో ఉన్నారు. వరుణుడు అంతరాయం కల్గించే అవకాశం లేకపోవడంతో అభిమానులు పూర్తి మ్యాచ్‌ను ఆస్వాదించవచ్చు.

జొహాన్నెస్‌బర్గ్: భారత్, దక్షిణాఫ్రికా జట్లు మరోమారు అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమయ్యాయి. గురువారం రెండు జట్ల మధ్య కీలకమైన మూడు టీ20 మ్యాచ్ జరుగనుంది. సఫారీలు ఇప్పటికే 1-0ఆధిక్యంలో ఉండగా, టీమ్‌ఇండియా కచిత్చంగా గెలిచి సిరీస్‌ను సమం చేయాలన్న పట్టుదలతో ఉంది. వర్షం అంతరాయం మధ్య సాగిన రెండో పోరులో దక్షిణాఫ్రికా విజయం(డక్‌వర్త్ లూయిస్ పద్ధతి)సొంతం చేసుకుంది. ఆస్ట్రేలియాపై సిరీస్ విజయంతో మంచి జోష్‌తో సఫారీ గడ్డపై అడుగుపెట్టిన సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని టీమ్‌ఇండియాను వరుణుడు నీడలా వెంటాడు. తొలి మ్యాచ్ కనీసం ఒక్క బంతి పడకుండానే రద్దు కాగా, రెండో పోరులో దక్షిణాఫ్రికాదే పైచేయి అయ్యింది. మూడో మ్యాచ్‌లో గెలిచి సిరీస్ చేజారకుండా సూర్యకుమార్ సేన ప్రయత్నించే అవకాశముంది. మరోవైపు కొట్టిన పిండిల్లాంటి సొంత పిచ్‌లపై తమ ప్రతాపం చూపించేందుకు మార్క్‌రమ్ కెప్టెన్సీలోని సఫారీలు కసితో కనిపిస్తున్నారు.

మార్పులు, చేర్పులతో:

దక్షిణాఫ్రికాతో మూడో టీ20 మ్యాచ్‌కు టీమ్‌ఇండియా మార్పులు, చేర్పులతో బరిలోకి దిగే అవకాశముంది. ఆసీస్‌తో సిరీస్‌తో రాణించిన అక్షర్‌పటేల్, రవి బిష్ణోయ్‌ను పక్కకుపెట్టడంపై బీసీసీఐపై అభిమానులు సోషల్‌మీడియాలో దుమ్మెత్తిపోస్తున్నారు. ఫామ్‌మీద ఉన్న వాళ్లను ఆడించాల్సింది పోయి మిగతావారికి ఎలా అవకాశమిస్తారంటూ ప్రశ్నలతో కడిగేస్తున్నారు. అనారోగ్యంతో గత మ్యాచ్‌కు దూరమైన ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్..తిరిగి జట్టులోకి వచ్చే అవకాశముంది. శుభ్‌మన్ గిల్ స్థానంలో రుతురాజ్‌కు చాన్స్ దక్కనుంది. మరోవైపు చైనామన్ స్పిన్నర్ కుల్దీప్‌యాదవ్‌కు బదులుగా బిష్ణోయ్ తుది జట్టులోకి రావచ్చు. రెండో పోరులో పేసర్లు సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, ముకేశ్‌కుమార్ తీవ్రంగా నిరాశపరిచారు. సఫారీ ఓపెనర్ రెజా హెండ్రిక్స్ వీరిని లక్ష్యంగా చేసుకుంటూ పరుగుల వరద పారించాడు. మూడో మ్యాచ్‌లోనూ ఇదే పునరావృతమైతే భారత్ సిరీస్ చేజార్చుకున్నట్లే

కొత్త ముఖాలతో!

మూడో మ్యాచ్‌కు సఫారీ టీమ్..కొత్త ముఖాలతో పోటీకి దిగే అవకాశముంది. జాన్సెన్, కొట్జె స్థానాల్లో నాంద్రె బుర్గర్, ఒటినెల్ బార్ట్‌మన్ తుది జట్టులోకి వచ్చే చాన్స్ కనిపిస్తున్నాయి. వీరికి తోడు ఆల్‌రౌండర్ ఫెరీరాకు అవకాశం దక్కవచ్చు.

జట్ల అంచనా: భారత్: జైస్వాల్, రుతురాజ్/గిల్, తిలక్‌వర్మ, సూర్యకుమార్(కెప్టెన్), రింకూసింగ్, జితేశ్‌శర్మ, జడేజా, అర్ష్‌దీప్‌సింగ్, కుల్దీప్/బిష్ణోయ్, సిరాజ్, ముకేశ్‌కుమార్ **దక్షిణాఫ్రికా:** హెండ్రిక్స్, బ్రిజ్కె, మార్క్‌రమ్(కెప్టెన్), క్లాసెన్, మిల్లర్, స్టబ్స్, ఫెరీరా, ఫెల్క్వాయో, విలియమ్స్, బార్ట్‌మన్/బుర్గర్, శంసీ.

టెస్టుకు సై

నేటి నుంచి భారత్, ఇంగ్లండ్ పోరు

నేవి ముంబై: భారత్, ఇంగ్లండ్ మహిళల జట్లు టెస్టు మ్యాచ్‌కు సై అంటున్నాయి. గురువారం నుంచి ఇరు జట్ల మధ్య ఏకైక టెస్టు మ్యాచ్ మొదలుకానుంది. ఇప్పటి వరకు ఇంగ్లండ్‌తో ఆడిన 14 మ్యాచ్‌ల్లో ఒకే ఒక మ్యాచ్‌లో ఓడిన టీమ్‌ఇండియా అదే ప్రదర్శన కొనసాగించాలని చూస్తున్నది. హర్మన్‌ప్రీత్‌కౌర్ తొలిసారి భారత టెస్టు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నది.

టైటాన్స్ అదే తీరు

బెంగళూరు: ప్రొ కబడ్డీ లీగ్(పీకేఎల్) పదో సీజన్‌లో తెలుగు టైటాన్స్ జట్టుకు గెలుపు కరువైంది. బుధవారం జరిగిన తమ నాలుగో మ్యాచ్‌లో టైటాన్స్ 36-38 తేడాతో తమిళ్ తలైవాస్ చేతిలో ఓటమిపాలైంది. తలైవాస్ టీమ్‌లో రైడర్ నరేందర్ పది పాయింట్లతో విజయంలో కీలకంగా వ్యవహరించాడు. టైటాన్స్ టీమ్‌లో కెప్టెన్ పవన్ శెరావత్ (7), రాబిన్ చౌదరీ (7), సంజీవి (6) రాణించినా లాభం లేకపోయింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.